ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

వాడవాడలా రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సోదర సోదరీమణుల అనుబంధం, అనురాగం, ప్రేమాప్యాయతలకు ప్రతీకగా ఏటా శ్రావణమాసంలోని పౌర్ణమి తిథి నాడు ఈ రాఖీ పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని, ఆపదలో అండగా నిలుస్తామని సోదరులు భరోసానిచ్చారు. ఊరూరా జరిగిన రక్షాబంధన్ సంబరాలతో పండగ వాతావరణం నెలకొంది. – బొబ్బిలి, రాజాం


బొబ్బిలి: డీఎస్పీ శ్రీనివాసరావుకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు


వంగర: రక్షాబంధన్ వేడుకల్లో రాఖీలు కడుతున్న చిన్నారులు


సంతకవిటి: ప్రైవేట్ పాఠశాలలో రాఖీలు కడుతున్న చిన్నారులు


రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో రాఖీ పండగ సందడి


రేగిడి: వన్నలిలో రక్షాబంధన్ వేడుకలు జరుపుకుంటున్న సోదరసోదరీమణులు


రామభద్రపురంలో అన్నయ్యలకు రాఖీలు కడుతున్న చిన్నారులు


బొబ్బిలి: సీఐ నాగేశ్వరరావుకు రాఖీ శుభాకాంక్షలు చెబుతున్న విద్యార్థులు


రాజాం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్‌కు రాఖీలు కడుతున్న మహిళలు


బొబ్బిలి: రాఖీ వేడుకలు జరుపుకుంటున్న బ్రహ్మకుమారీలు


తెర్లాం: లోచర్లలో అన్నయ్యకు రాఖీలు కడుతున్న చెల్లెళ్లు


బొబ్బిలి: రక్షాబంధన్ సందర్భంగా చెట్టుకు రాఖీ కట్టి వృక్షాబంధన్ జరుపుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనలు


ఎమ్మెల్సీ బొత్సకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు

రామభద్రపురం: ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా, స్థానికసంస్థల ఎమ్మెల్సీగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం విశాఖలోనే నివాసముంటున్న ఆయనను టీటీడీ పాలక మండలి మాజీ డైరెక్టర్, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సోమవారం కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రామభద్రపురం పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వంగర: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో లోపింటి త్రినాథ్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులంతా హాజరుకావాలని కోరారు.

చురుగ్గా ఫీవర్ సర్వే


ఖండ్యాంలో రక్తనమూనాలు సేకరిస్తున్న ఏఎన్‌ఎం, సిబ్బంది


రేగిడి: మండలంలోని బూరాడ, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఫీవర్ సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు కలిసి ఇంటింటికీ వెళ్లి, జ్వరాలు, జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే పక్కాగా నిర్వహిస్తున్నామని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు సీహెచ్ అసిరినాయుడు, ఎస్.చలమయ్య తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమణ

బొండపల్లి: గంజాయి రవాణా కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించామని గజపతినగరం సీఐ జి.ఎ.వి.రమణ తెలిపారు. సోమవారం ఆయన ఎస్ఐ కె. లక్ష్మణరావుతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. విశాఖపట్నంలోని గాయత్రీ ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తున్న మండలంలోని కెరటాం గ్రామానికి చెందిన పవన్ కుమార్ ఒడిశా నుంచి గంజాయిని విశాఖపట్నం రవాణా చేస్తుండగా నెలివాడ గ్రామ జంక్షన్‌లో జాతీయ రహదారి-26పై పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 1,800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పవన్‌కు ఒడిశా రాష్ట్రంలోని సుంకిలో ఉంటున్న సుంకర్ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడి కావడంతో ఆ వక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత


దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న సుబ్బలక్ష్మి ట్రస్టు సభ్యులు

కొత్తవలస: మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు గొల్జాపు పెంటయ్యకు సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు వారు సోమవారం ట్రైసైకిల్ అందజేశారు. మూడు నెలల క్రితం పెంటయ్య కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడిపోవడంతో రెండు కాళ్లు తెగిపోయాయి. బాధితుడికి సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ద్వారా దాతలు వి.సునీత,డి.విజయలక్ష్మి ఆర్థిక సహాయంతో ట్రైసైకిల్ అందజేశారు. ట్రస్టు చైర్మన్ కనకాల శివ, సభ్యులు పి.శివరామకృష్ణ, వార్డు మెంబర్లు గొరపల్లి అప్పలస్వామి,గాలి అప్పారావు, కర్రి సూర్యనూకరావు పాల్గొన్నారు.

సకాలంలో సేవలు అందించాలి

రాజాం: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. గ్రామాల వారీగా జరుగుతున్న పారిశుధ్య పనులపై ఆరాతీశారు. పెండింగ్‌లో ఉన్న ఇంటిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే ధ్రువీకరణ పత్రాల కోసం చేసుకున్న అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

వినూత్నంగా బోధించాలి

రాజాం: విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి కలిగేలా వినూత్నంగా విద్యాబోధన చేయాలని ఎంఈవో బి.ప్రవీణ్ కుమార్ సూచించారు. మండలంలోని పొగిరి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన.. బోధనోపకరణాల సాయంతో పాఠ్యాంశాలు బోధించాలని, అప్పుడే విద్యార్థికి మనం చెప్పే విషయం బాగా అర్థమవుతుందన్నారు. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ)ల భాగస్వామ్యం తీసుకోవాలని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

వర్షంతో ఉపశమనం

రాజాం/సంతకవిటి: మండల కేంద్రాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. కొన్నిరోజులుగా తీవ్రమైన ఉక్కపోతతో అలమటిస్తున్న ప్రజలు ఇప్పుడు పడిన వర్షంతో ఉపశమనం పొందారు. వరి పంటపొలాలకు కూడా ఈ నీరు పనికివస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


రాజాం కేర్ ఆస్పత్రి సెంటర్ వద్ద జోరుగా కురుస్తున్న వాన

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

• సీనియర్ సివిల్ జడ్జి విజయకల్యాణి

శృంగవరపుకోట: కారాగారాల్లో ఉన్న రిమాండ్ ఖైదీలకు అవసరమైతే ఉచితంగా న్యాయసహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకల్యాణి చెప్పారు.స్థానిక సబ్‌జైలును సోమవారం సందర్శించారు. కారాగారం పరిసరాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న వసతులు, సౌకర్యాలు, ఆహారం, ఆరోగ్యం, వంటి విషయాలతో పాటు కుటుంబ నేపథ్యాలపై ఆరా తీశారు.న్యాయ సహాయ కేంద్రం గురించి ఖైదీలకు వివరించారు. ఉచిత న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఏర్పాటు చేస్తారని చెప్పారు. పారా లీగల్ వాలంటీర్, జైలు సందర్శక న్యాయవాది ప్రతీవారం జైలును సందర్శించి ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయం అందించాలని ఆదేశించారు.


ఎస్.కోట సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి విజయకల్యాణి

వర్గీకరణతో దళితుల్లో విభేదాలు

గుర్ల: ఎస్సీ వర్గీకరణ వల్ల దళితుల మధ్య ఐక్యత దెబ్బతిని విభేదాలు వస్తాయని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ (ఎయిమ్) జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు అన్నారు. మండల కేంద్రంలో దళితులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల దళితులకు మేలుకంటే అన్యాయమే ఎక్కువన్నారు. ఇప్పటి వరకు దళితులంతా ఐక్యంగా ఉన్నారని, వర్గీకరణ జరిగితే ఆ పరిస్థితి ఉండే అవకాశం లేదన్నారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ఎస్సీ వర్గీకరణ వల్ల జరిగే పరిణామాలపై చైతన్యం చేయాలని ఎయిమ్ సంస్థ సభ్యులకు సూచించారు.

బంద్‌ను విజయవంతం చేయండి

బొబ్బిలి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద ఈ నెల 21వ తేదీన చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య కోరారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని, వర్గీకరణ అంశాన్ని రాష్ట్రాలకు అప్పగించడం ఎంతమాత్రం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ రాజ్యాంగ పరిధిలోని అంశమని, ప్రస్తుతం తెరపైకి వచ్చిన ఎస్సీ వర్గీకరణ అంశం కేవలం ఎస్సీల ఐక్యతను దెబ్బతీసేందుకు రాజకీయ శక్తులు చేస్తున్న కుట్రగా తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా మాల సంఘాలు మేల్కోవాలని, తమ హక్కుల కాలరాత జరగకుండా చూసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఉదయం 7 గంటలకు జరిగే బంద్‌లో అందరూ పాల్గొని, తమ గొంతును దేశానికి చాటి చెప్పాలన్నారు.

దత్త జ్ఞానబోధ సభ

రేగిడి: మండల కేంద్రంలోని దత్తపీఠంలో దత్త జ్ఞానబోధ సభ సోమవారం నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాలకొండకు చెందిన ఎన్‌వీ రమణ పాల్గొని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల బంధం గురించి వివరించారు. సోదరసోదరీమణుల అనుబంధం, అనురాగం, ఆప్యాయతలకు ప్రతీకగా రాఖీ పండగ జరుపుకుంటామని, ప్రతీ సోదరి తమ సోదరుడు బాగుండాలని, తమకు రక్షగా నిలవాలని ఆకాంక్షిస్తూ రాఖీలు కడతారని తెలిపారు. కార్యక్రమంలో ఎర్రాపాత్రుని భాస్కరరావు, హేమసుందరరావు, కుడుతుల మురళి, సతివాడ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

సంతకవిటి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య మహాజన సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక చేపట్టారు. అధ్యక్షురాలిగా కె.సూర్యకాంతం, ఉపాధ్యక్షురాలిగా జి.అనితకుమారి, కోశాధికారిగా జి.సుజాత, కార్యదర్శిగా ఎ.సరస్వతి, సంయుక్త కార్యదర్శిగా ఎ.మంగమ్మ ఎంపికైనట్లు ఏపీఎం సీతారాం తెలిపారు. అనంతరం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

‘సూపర్ సిక్స్’ అమలెప్పుడు?

బొబ్బిలి: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని కూటమి ప్రభుత్వాన్ని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడిచినా ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాల్లోని ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. పథకాల కోసం ఓట్లు వేసిన జనమంతా పథకాలు ఎప్పుడు ఇస్తారని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ పథకం ఎప్పుడు ఇస్తారో ముందుగానే క్యాలెండర్ విడుదల చేసి, ఆ తేదీల ప్రకారం ఇచ్చేవారన్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైనా ఇంతవరకు రైతుకు ఇస్తానన్న రూ.20 వేలు ఇంకా ఇవ్వలేదన్నారు. పాఠశాలలు ప్రారంభమైనా ఇప్పటివరకు తల్లికి వందనం పథకం కింద ప్రతీ పిల్లవాడికి ఇస్తానన్న రూ.15 వేలు అందివ్వలేదన్నారు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా స్పష్టత ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఏ పథకం ఎప్పుడు ఇస్తారో చెప్పకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పించండి

తెర్లాం: శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానిక ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై, ఎంపీడీవో శంబంగి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ముఖ్యంగా వర్షాకాలంలో బురదలో పాడె మోసుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కొన్నిసార్లు బురదలో జారిపడి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయన్నారు. కొన్నేళ్ల క్రితం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గోర్జిలో నుంచి శ్మశానవాటికకు వెళ్లేవారమని, కొంతకాలంగా ఆ గోర్జి బాగులేకపోవడంతో అలా వెళ్లడం మానేశామన్నారు. గతంలో తాము శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు ఇప్పుడు బాగుందని, అదే దారిలో వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని వారంతా కోరారు. స్పందించిన ఎంపీడీవో.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ కాలనీ యువకులు

నిధుల వినియోగంపై ఆడిట్

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామపంచాయతీలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ ఆడిటర్ ఎంవీబీఎస్ రాజు, సీనియర్ అసిస్టెంట్ ఉమాదేవిల బృందం సోమవారం ఆడిట్ చేయగా, వారికి అవసరమైన రికార్డులను కార్యాలయ సిబ్బంది అందజేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను మంజూరైన నిధులు, వినియోగం, పీడీఎఫ్, జనరల్ ఫండ్స్, 15వ ఆర్థికసంఘం నిధులు-ఖర్చులపై ఆరాతీశారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిట్ బృందం

ఘనంగా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం

రాజాం సిటీ: పట్టణంలో ఫొటో, వీడియోగ్రాఫర్‌ల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కెమెరా సృష్టికర్త డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గత తరాన్ని భవిష్యత్ తరాలకు అందించడంలో ఫొటోగ్రాఫర్ పాత్ర చాలా కీలకమని ఫొటో, వీడియోగ్రాఫర్‌ల సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్.సతీష్ ప్రశంసించారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా గ్రామీణ ప్రాంత ఫొటోగ్రాఫర్లు అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.తిరుపతిరావు, కృష్ణమూర్తి, ఎం.చందు, పి.రాము, అన్నమ్స్, ఎస్.మురళి తదితరులు పాల్గొన్నారు.


డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పురోహితులు రేజేటి సత్తిబాబు శర్మ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు జరిగిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులంతా అమ్మవారి దర్శనానికి పోటెత్తారు.

సంతకవిటి: మండలంలోని బొద్దూరు గ్రామ మల్లిఖార్జునస్వామి ఆలయంలో పలు విగ్రహాల ప్రతిష్ట సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు ఎం.అమ్మోజీరావు ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి, అయ్యప్పస్వామి, శ్రీకృష్ణపరమాత్మ, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలతో పాటు గ్రామానికి చెందిన ప్రముఖ శివమాలదీక్షాధారణ గురుస్వామి చల్లా వెంకటరమణ గురువు విగ్రహం ఏర్పాటు చేసి ప్రాణప్రతిష్ట చేశారు. అనంతరం రుద్రయాగం చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో పురోహితులు రంపా మహేశ్వరరావు శర్మ తదితరులు పాల్గొన్నారు.


రేగిడి: సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


సంతకవిటి: యాగం చేస్తున్న భక్తులు